నేడు విద్యుత్‌ సరఫరా ఉండని ప్రాంతాలు

చార్మినార్‌: విద్యుత్‌ మరమ్మతుల కారణంగా బుధవారం పలు ప్రాంతాల్లో విద్యుత్‌ సరఫరా అంతరాయం కలుగుతుందని చార్మినార్‌ సీబీడీ ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. షరీఫ్‌ నగర్‌ విద్యుత్‌ ఫీడర్‌ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు. ఎస్‌.ఎం.గూడా విద్యుత్‌ ఫీడర్‌ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు. వీకెండ్‌ సెక్షన్‌ విద్యుత్‌ ఫీడర్‌ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్‌ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

సుల్తాన్‌ షాహి ఫీడర్‌ పరిధిలో..

సుల్తాన్‌ షాహి విద్యుత్‌ ఫీడర్‌ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల వరకు. మేతర్‌ వాడి విద్యుత్‌ ఫీడర్‌ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్‌ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

నేడు సంత్‌ రవిదాస్‌ మహరాజ్‌ జయంతి

జియాగూడ: సంజయ్‌నగర్‌లోని శ్రీ హరలయ్యా సంగర్‌ సమాజ్‌ కమ్యూనిటీ హాల్‌లో పరం పూజ్య 108 సంత్‌ శిరోమణి జగద్గురు రవిదాస్‌ మహరాజ్‌ 648వ జయంతి వేడుకలను భారీ ఎత్తున నిర్వహిస్తున్నట్లు కమిటీ చైర్మన్‌ కిషన్‌ దామ, అధ్యక్షుడు సంజయ్‌ కుమార్‌ కాంబ్లె, ప్రధాన కార్యదర్శి టి.రవి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం సాయంత్రం సంత్‌ రవిదాస్‌ చిత్రపటానికి పూజలు, భజన సత్సంగ్‌ కార్యక్రమం, సంత్‌ గురుదేవ్‌ సంత్‌పాల్‌ జీ మహారాజ్‌జీ శిష్యుడు మహాత్మా మునిషానంద్‌జీ మహరాజ్‌ ప్రసంగం, అన్న ప్రసాద కార్యక్రమం ఉంటుందన్నారు.

తెలంగాణలో ఐఐఎం ఏర్పాటు చేయాలి



కేంద్ర మంత్రి ధర్మేందర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ అనిల్‌కుమార్‌ యాదవ్‌

అబిడ్స్‌: తెలంగాణకు ఇండియన్‌ ఇనిస్టిట్యూట్‌ ఆఫ్‌ మేనేజ్‌మెంట్‌ (ఐఐఎం) ఇవ్వాలని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేందర్‌ ప్రధాన్‌కు రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్‌కుమార్‌ యాదవ్‌ విజ్ఞప్తి చేశారు. మంగళవారం న్యూఢిల్లీలో మంత్రి ధర్మేందర్‌ను ఆయన కలిసి మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా అనిల్‌ కుమార్‌ యాదవ్‌ మాట్లాడుతూ..తెలంగాణలో ఐఐఎం ఏర్పాటు చేస్తే తెలంగాణ బ్రాండ్‌ ఇమేజ్‌ మరింత పెరుగుతుందన్నారు. బహుళ జాతి సంస్థలకు అనుకూలమైన తెలంగాణలో ఆర్థిక వ్యవస్థ డిమాండ్‌కు అనుగుణంగా మానవ వనరుల అందుబాటు ఎంతో అవసరమని ఆయన అన్నారు.

పెళ్లి పత్రికలు ఇచ్చేందుకు వెళ్తుండగా..

- బైక్‌ను ఢీకొట్టిన కారు
- ఒకరు మృతి, మరొకరి పరిస్థితి విషమం

యాదగిరిగుట్ట రూరల్‌: పెళ్లి పత్రికలు ఇచ్చేందుకు వరుడి ఇంటికి వధువు సోదరుడు తన బంధువుతో కలిసి బైక్‌పై వెళ్తుండగా కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వధువు బంధువు మృతిచెందగా, వధువు సోదరుడికి తీవ్ర గాయాలై పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన వరంగల్‌–హైదరాబాద్‌ జాతీయ రహదారిపై యాదగిరిగుట్ట మండలం గోధుమకుంట గ్రామ పరిధిలో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని కిషన్‌బాగ్‌ ప్రాంతానికి చెందిన ఎండీ ఇబ్రహీం సోహెల్‌ దుబాయ్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. సోహెల్‌ అక్కకు హన్మకొండకు చెందిన వ్యక్తితో వివాహం నిశ్చయమైంది. సోహెల్‌ తండ్రి గతంలోనే మృతి చెందగా.. అక్క పెళ్లి దగ్గరుండి చేయాలని పదిహేను రోజుల క్రితం దుబాయ్‌ నుంచి హైదరాబాద్‌కు వచ్చాడు. ఈ నెల 21వ తేదీన పెళ్లి ముహూర్తం పెట్టుకుని వరుడు ఇంటికి వెళ్లి పెళ్లి పత్రికలు ఇచ్చేందుకు మంగళవారం తెల్లవారుజామున తన సమీప బంధువు ఎండీ అస్లాంతో కలిసి రాయల్‌ ఎన్‌ఫీల్డ్‌ బైక్‌పై సోహెల్‌ హన్మకొండకు బయల్దేరాడు. మార్గమధ్యలో యాదగిరిగుట్ట మండలం గోధుమకుంట గ్రామపరిధిలోని హరిత వెంచర్‌ సమీపంలోకి రాగానే వెనుక నుంచి అతివేగంగా వచ్చి ఇన్నోవా కారు బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై వెనక కూర్చున్న ఎండీ అస్లాం(27) తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. బైక్‌ నడుపుతున్న ఎండీ సోహెల్‌కి తీవ్ర గాయాలై రక్తం స్రావం అవుతుండగా స్థానికులు 108 వాహనంలో ఆలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రమేష్‌ తెలిపారు.

రేషన్‌ కార్డులకు క్యూ

- మీ సేవా కేంద్రాలకు బారులు తీరిన దరఖాస్తుదారులు
- కేంద్రాలను సందర్శించిన ఎమ్మెల్యేలు



చోటాబజార్‌లోని మీసేవా సెంటర్‌ వద్ద క్యూ కట్టిన మహిళలు



మహిళలతో మాట్లాడుతున్న కార్వాన్‌ ఎమ్మెల్యే కౌసర్‌ మోహియుద్దీన్‌



దరఖాస్తులను పరిశీలిస్తున్న చార్మినార్‌ ఎమ్మెల్యే జుల్ఫికర్‌ అలీ

గోల్కొండ: కొత్త రేషన్‌ కార్డుల కోసం మీ సేవా కేంద్రాలకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. దీంతో రెండు రోజుల నుంచి కార్వాన్‌ నియోజకవర్గంలోని వివిధ మీ సేవా కేంద్రాల ముందు భారీగా మహిళలు క్యూ కట్టారు. కార్వాన్‌, లంగర్‌హౌస్‌, గోల్కొండ, నానల్‌నగర్‌ తదితర ప్రాంతాల్లోని మీసేవా కేంద్రాల వద్ద ఉదయం 6 గంటల నుంచే మహిళలు క్యూ కడుతున్నారు. అయితే కొన్ని మీసేవా కేంద్రాల వద్ద దళారులు రూ.100 నుంచి 1000 వరకు వసూలు చేస్తూ వారిని చాటుగా మీ సేవా కేంద్రంలోకి పంపిస్తున్నారని సీనియర్‌ కాంగ్రెస్‌ నాయకుడు ఆజామ్‌ఖాన్‌ ఆరోపించారు. ఏదేమైనా గంపెడు ఆశతో కొత్త రేషన్‌ కార్డుకు దరఖాస్తు చేసుకునేందుకు మీ సేవ కేంద్రాలకు వచ్చిన మహిళలు గంటల తరబడి నిలబడుతున్నారు.

మీ సేవా కేంద్రాల వద్ద పర్యటించిన ఎమ్మెల్యే..

అర్హులైన ప్రతి ఒక్కరి నుంచి ప్రభుత్వం సూచించిన రుసుము తీసుకొని రేషన్‌ కార్డుల కోసం దరఖాస్తులు స్వీకరించాలని ఎమ్మెల్యే కౌసర్‌ మోహియుద్దీన్‌ అన్నారు. మంగళవారం సాయంత్రం ఆయన కార్వాన్‌ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లోని మీసేవా కేంద్రాల వద్ద పర్యటించారు. మీ సేవా కేంద్రాల వద్ద పలువురు ఏజెంట్లు రేషన్‌ కార్డుల దరఖాస్తుల కోసం డబ్బులు వసూలు చేస్తున్నారన్న విషయం తెలుసుకున్న ఆయన ఆకస్మికంగా నానల్‌నగర్‌, టోలిచౌకీ, గోల్కొండలలోని మీసేవా కేంద్రాలను సందర్శించారు. మహిళల వద్ద ఎక్కువ ఫీజులు వసూలు చేస్తే అటువంటి మీసేవా నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

అర్హులందరికీ రేషన్‌ కార్డులు..

దూద్‌బౌలి: అర్హులందరికీ రాష్ట్ర ప్రభుత్వం రేషన్‌ కార్డులుఅందజేస్తుందని చార్మినార్‌ ఎమ్మెల్యే జుల్ఫికర్‌ అలీ అన్నారు. మంగళవారం ఈ సేవ మీసేవ సెంటర్ల వద్ద భారీ సంఖ్యలో దరఖాస్తులు చేసుకునేందుకు బారులు తీరి కనిపించారు. పురానాపూల్‌ కోక తట్టి ప్రాంతంలోని సర్కిల్‌–3 ఏఎస్‌ఓ కార్యాలయానికి పెద్ద ఎత్తున ప్రజలు దరఖాస్తు చేసుకునేందుకు, పేరు డిలీట్‌ చేసుకునేందుకు తరలిరావడంతో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. హుసేనీ ఆలం పోలీసులు దరఖాస్తుదారులకు నచ్చచెప్పి పరిస్థితిని చక్కదిద్దారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అక్కడికి చేరుకొని ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని ఏఎస్‌ఓను కోరారు.

సెంట్రల్‌ పీస్‌ అండ్‌ వెల్ఫేర్‌ కమిటీ సేవలు ప్రశంసనీయం



సౌత్‌ వెస్ట్‌ జోన్‌ డీసీపీ చంద్రమోహన్‌ను సన్మానిస్తున్న మోజమ్‌ అలీఖాన్‌

గోల్కొండ: సెంట్రల్‌ పీస్‌ అండ్‌ వెల్ఫేర్‌ కమిటీ సేవలు ప్రశంసనీయమని సౌత్‌ వెస్ట్‌ జోన్‌ డీసీపీ జి.చంద్రమోహన్‌ అన్నారు. సెంట్రల్‌ పీస్‌ అండ్‌ వెల్ఫేర్‌ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం కార్వాన్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు మోజమ్‌ అలీఖాన్‌ డీసీపీని గజమాలతో సన్మానించారు. అనంతరం డీసీపీ మాట్లాడుతూ.. శాంతిభద్రతల పరిరక్షణలో సెంట్రల్‌ పీస్‌ అండ్‌ వెల్ఫేర్‌ కమిటీ చేస్తున్న కృషిని వెలకట్టలేమన్నారు. స్థానికంగా జరిగే బోనాలు, వినాయక ఉత్సవాలు, మోహర్రం, రంజాన్‌ తదితర పండుగల సందర్భంగా పోలీసులకు కమిటీ సభ్యులు ఎప్పటికప్పుడు తమతమ ప్రాంతాల్లోని సమాచారాన్ని అందిస్తుంటారన్నారు. ఈ సందర్భంగా మోజమ్‌ అలీఖాన్‌ 25 సీసీ కెమెరాలను డీసీపీకి అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ గౌస్‌, ఏసీపీలు సయ్యద్‌ ఫయాజ్‌, మునావర్‌, వెంకట్‌రెడ్డి, నర్సింహతో పాటు గోల్కొండ, హుమాయున్‌నగర్‌, టపాచపుత్ర, ఆసిఫ్‌నగర్‌ పోలీస్‌స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

వీధి దీపాల ఏర్పాటు



వీధి దీపాలతో మజ్లిస్‌ నాయకుడు సతీష్‌ తదితరులు

చాంద్రాయణగుట్ట: ప్రజా సమస్యల పరిష్కారంలో మజ్లిస్‌ పార్టీ ముందంజలో ఉంటుందని ఆ పార్టీ సీనియర్‌ నాయకుడు మస్న సతీష్‌ అన్నారు. మంగళవారం ఉప్పుగూడ డివిజన్‌లోని సాయిబాబానగర్‌లో మరో నాయకుడు శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి జీహెచ్‌ఎంసీ తరఫున మంజూరైన పది వీధి దీపాలను అమర్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..వీధి దీపాలు వెలగకపోవడంతో రాత్రి పూట అంధకారం నెలకొని స్థానికులు అవస్థలు పడ్డారన్నారు. విషయాన్ని కార్పొరేటర్‌ ఫహద్‌, మాజీ కార్పొరేటర్‌ సమద్‌ బిన్‌ అబ్దాద్‌ దృష్టికి తీసుకెళ్లిన వెంటనే వారు వీధి దీపాలను మంజూరు చేయించారన్నారు.

కరాటేలో సత్తా

చాంద్రాయణగుట్ట: అంతర్జాతీయ 4వ మార్షల్‌ ఆర్ట్స్‌ చాంపియన్‌షిప్‌ కరాటే పోటీల్లో నాయక్‌ బుడోఖాన్‌ కరాటే అకాడమీ విద్యార్థులు సత్తా చాటారు. ఉత్తమ ప్రదర్శనతో బంగారు పతకాలను సాధించారు. సరూర్‌నగర్‌ ఇండోర్‌ స్టేడియంలో జరిగిన న్యూ డ్రాగన్‌ ఫైటర్స్‌ మార్షల్‌ ఆర్ట్స్‌ చాంపియన్‌షిప్‌–2025 పోటీల్లో అకాడమీలో శిక్షణ పొందుతున్న రాజన్నబావి తక్షశీల పాఠశాలకు చెందిన విద్యార్థులు 18 మెడల్లను సాధించారు. ఎనిమిది గోల్డ్‌, ఆరు సిల్వర్‌, నాలుగు కాంస్య పతకాలను పొందారు. ఈ సందర్భంగా మంగళవారం విద్యార్థులను ప్రిన్సిపాల్‌ పి.వి.ఎస్‌ ప్రసాద్‌, అకాడమీ మాస్టర్‌ గణేష్‌ నాయక్‌, రవి, ఉదయ్‌ సత్కరించి, అభినందనలు తెలియజేశారు.



మెడల్లతో విద్యార్థులు

క్లాస్‌–3, క్లాస్‌–4 ఉద్యోగాల భర్తీ చేయాలి



కార్యాలయం ఎదుట నిరసన వ్యక్త చేస్తున్న రవీందర్‌ సుబ్బారావు, పద్మావతి తదితరులు

అబిడ్స్‌: భారతీయ జీవిత బీమా సంస్థలో క్లాస్‌–3, క్లాస్‌–4 ఉద్యోగాలకు వెంటనే రిక్రూట్‌మెంట్‌ చేపట్టాలని సంఘానికి గుర్తింపు ఇవ్వాలని కోరుతూ ఇన్సూరెన్స్‌ కార్పొరేషన్‌ ఎంప్లాయిస్‌ యూనియన్‌ హైదరాబాద్‌ డివిజన్‌ ఆధ్వర్యంలో ప్రదర్శన చేపట్టారు. మంగళవారం భోజన విరామ సమయంలో హిమాయత్‌నగర్‌ బ్రాంచ్‌ కార్యాలయం వద్ద నినాదాలు చేస్తూ నిరసన ప్రదర్శన చేపట్టారు. ఎల్‌ఐసీ సంస్థ ప్రభుత్వ రంగంలో అద్భుత ప్రగతిని సాధిస్తుందన్నారు. వెంటనే క్లాస్‌–3, క్లాస్‌–4 ఉద్యోగాల భర్తీ చేసి ఎల్‌ఐసీ సంస్థను బలోపేతం చేయాలన్నారు. యాజమాన్యాలు సానుకూలంగా స్పందించనట్లయితే ఈ నెల 20వ తేదీన ఒక గంట పాటు దేశవ్యాప్తంగా సమ్మె నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రవీందర్‌, సుబ్బారావు, పద్మావతి, వరలక్ష్మి, రఘురామన్‌ తదితరులు పాల్గొన్నారు.

‘ప్రజలకు అందుబాటులో ఉంటా’

గోల్కొండ: ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి ఫిర్యాదులను స్వీకరించి పరిష్కరించడమే తమ ప్రధాన లక్ష్యమని గోల్కొండ ఏసీపీ సయ్యద్‌ ఫయాజ్‌ అన్నారు. మంగళవారం సెంట్రల్‌ పీస్‌ అండ్‌ వెల్ఫేర్‌ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయనను సన్మానించారు. ఆయన మాట్లాడుతూ..గోల్కొండ పోలీస్‌స్టేషన్‌లో తాను మూడేళ్ల పాటు ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించానని అదే గోల్కొండ డివిజన్‌కు ఏసీపీగా సంవత్సర కాలంగా పని చేస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్‌ పీస్‌ అండ్‌ వెల్ఫేర్‌ కమిటీ సభ్యులు ఆబేద్‌, పాషా, యూసుస్‌ తదితరులున్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న సందీప్‌ శాండిల్యా

చాంద్రాయణగుట్ట: విద్యార్థులంతా మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటూ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని తెలంగాణ యాంటీ నార్కోటిక్స్‌ డైరెక్టర్‌ సందీప్‌ శాండిల్యా అన్నారు. బండ్లగూడలోని గౌస్‌నగర్‌ పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహన సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ..ఇటీవల కాలంలో పాఠశాల దశ నుంచే విద్యార్థులు మత్తుకు బానిసలవుతున్న ఘటనలు వెలుగుజూస్తున్నాయన్నారు. మాదక ద్రవ్యాల బారిన పడడంతో జీవితాలు నాశనం అవుతాయని ఆయన వివరించారు. ఆలోచన శక్తిని కోల్పోయి సమాజంలో విద్రోహ శక్తులుగా మారే అవకాశం ఉందన్నారు. ఇలాంటి వాటి పట్ల ప్రతి ఒక్కరు అవగాహన పొంది డ్రగ్స్‌ నియంత్రణకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నార్కోటిక్స్‌ ఏసీపీ సుబ్బరామి రెడ్డి, చాంద్రాయణగుట్ట ఏసీపీ మనోజ్‌ కుమార్‌, ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్‌, సత్యనారాయణ, బండ్లగూడ డీఐ శ్రీనివాస్‌, ఎస్సై నాగరాజు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రంగరాజన్‌పై దాడి అమానుషం

జియాగూడ: చిలుకూరి బాలాజీ ఆలయ ప్రధాన అర్చకులు రంగరాజన్‌పై దాడి చేయడం అమానుషం అని జియాగూడ రంగనాథ దేవస్థానం ప్రతినిధులు శృంగారం బద్రీనాథచార్యులు, ఆలయ ప్రధాన అర్చకులు రంగనాథచార్యులు తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు మంగళవారం వారు జియాగూడ రంగనాథ ఆలయంలో మాట్లాడుతూ..కొందరు గుర్తు తెలియని వ్యక్తులు రామరాజ్యం ముసుగులో రంగరాజన్‌ ఇంట్లో చొరబడి దుర్భాషలాడుతూ దాడి చేయడం దారుణమన్నారు. పోలీసుశాఖ నిందితులను గుర్తించి వారికి తగిన విధంగా బుద్ధి చెప్పాలన్నారు. రంగరాజన్‌ చేస్తున్న సేవలను గుర్తించాల్సింది పోయి దాడులకు పాల్పడడం హేయమైన చర్య అన్నారు.

రంగరాజన్‌పై దాడి హేయమైన చర్య

గౌలిపురా: చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకుడు రంగరాజన్‌పై దాడి హేయమైన చర్య అని అభ్యుదయ రచయితల సంఘం హైదరాబాద్‌ జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి గడ్డమీది చంద్రమోహన్‌ గౌడ్‌ అన్నారు. మంగళవారం విలేకర్లతో మాట్లాడుతూ.. ఆలయ అర్చకుడిగా కొనసాగుతూ అంటరాని తనాన్ని చెంతకు రానివ్వనని, మరో రామనుజన్‌గా పేరు తెచ్చుకున్న గొప్ప వ్యక్తి అన్నారు. ప్రజాస్వామ్యంలో దొంగల ముఠా లాగా దాడి చేయడం సిగ్గుచేటన్నారు. ఈ దాడికి పాల్పడిన దుర్మార్గులను కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్‌ చేశారు.

అర్చకుడిపై దాడిని ఖండించిన గోవర్ధన్‌ రెడ్డి..

యాకుత్‌పురా: రంగారాజన్‌పై చేసిన దాడిని తెలంగాణ న్యాయవాదుల జేఏసీ కన్వీనర్‌ పులిగారి గోవర్ధన్‌ రెడ్డి తీవ్రంగా ఖండించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ..తెలంగాణలో మరో తిరుపతిగా భావించే చిలుకూరి ఆలయానికి ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. ఆలయాన్ని అప్పగించాలంటూ అర్చకుడి ఇంటిపై దాడికి పాల్పడిన వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

శ్మశానవాటికల్లో పనుల పరిశీలన



జమాలికుంట శ్మశానవాటికలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే కౌసర్‌

గోల్కొండ: రానున్న జగ్నేకి రాత్‌ సందర్భంగా ముస్లిం శ్మశాన వాటికల్లో పారిశుద్ధ్య పనులు చేయిస్తున్నామని ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్‌ అన్నారు. మంగళవారం ఆయన గోల్కొండ, హకీంపేట్‌, కార్వాన్‌, లంగర్‌హౌస్‌ తదితర ప్రాంతాల్లోని ముస్లిం శ్మశానవాటికలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా శ్మశానవాటికల్లో జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. జగ్నేకి రాత్‌ రోజున ముస్లింలు మృతి చెందిన తమ కుటుంబసభ్యుల సమాధుల వద్దకు వచ్చి సమాధులపై పూలు వేసి నివాళులర్పిస్తారని ఆయన అన్నారు. ఇందుకు గాను శ్మశానవాటికల్లో పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించే పనులు మరింత వేగవంతం చేయాలన్నారు. ఆయన వెంట జమాలికుంట ముస్లిం శ్మశానవాటిక ప్రతినిధి అజీజ్‌ఖాన్‌ పటాన్‌, మజ్లిస్‌ సీనియర్‌ నాయకులు హారూన్‌ఫరాన్‌ తదితరులున్నారు.

‘రంజాన్‌లో అదనపు బందోబస్తు అవసరం’

చార్మినార్‌: రంజాన్‌ మాసాన్ని పురస్కరించుకుని పాతబస్తీలో రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో అవసరమైన అదనపు బందోబస్తు ఏర్పాటు చేయాలని బీఆర్‌ఎస్‌ చార్మినార్‌ శాసన సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మహ్మద్‌ సలావుద్దీన్‌ లోధీ దక్షిణ మండలం డీసీపీ స్నేహా మెహ్రాను కోరారు. రంజాన్‌ మాసంలో వ్యాపారాలు పాతబస్తీ కేంద్రంగా ఎక్కువగా జరుగుతాయని..ఇందుకు అవసరమైన బందోబస్తు అవసరం ఉంటుందన్నారు. చార్మినార్‌, మక్కా మసీదు, గుల్జార్‌హౌస్‌, మీరాలం మండి, మదీనా, పత్తర్‌గట్టి, దారుషిఫా, పురానీహవేలీ, పురానాపూల్‌, మూసాబౌలి తదితర ప్రధాన రద్దీ గల కూడళ్లల్లో అదనపు బలగాల మొహరింపు అవసరమన్నారు. గత రంజాన్‌ మార్కెట్‌లలో చోటు చేసుకున్న దొంగతనాలను దృష్టిలో పెట్టుకుని పోలీసుల నిఘా పెంచాలని ఆయన కోరారు.

‘ప్రాంతీయ పార్టీలకు కాలం చెల్లింది’

గోల్కొండ: మన దేశంలో ప్రాంతీయ పార్టీలకు కాలం చెల్లిందని బీజేపీ కిసాన్‌ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవర శ్రీనివాస్‌అన్నారు. తెలంగాణలో పదేళ్ల పాలించిన ప్రాంతీయ పార్టీని ప్రజలు తిరస్కరించారని అదే విధంగా ఢిల్లీలో కూడా ప్రాంతీయ పార్టీని తరిమికొట్టి ప్రజలు బీజేపీకి పట్టం కట్టారన్నారు. బీజేపీ సునామీలో జాతీయ పార్టీ అయిన కాంగ్రెస్‌ అడ్రస్‌ గల్లంతవుతుందని ఇక ప్రాంతీయ పార్టీలకు కూడా కాలం చెల్లిందన్నారు.

22, 23 తేదీల్లో డెక్కన్‌ హెమటో లింక్‌ సదస్సు

సుల్తాన్‌బజార్‌: హెమటాలజీ పురోగతిపై సమావేశం ఈ నెల 22, 23 తేదీల్లో హైటెక్‌ సిటీ యశోద ఆసుపత్రి ఆడిటోరియంలో నిర్వహిస్తున్నట్లు ఆసుపత్రి సీనియర్‌ కన్సల్టెంట్‌ హెమటాలజిస్ట్‌, హెమటో–అంకాలజిస్ట్‌, బోన్‌ మ్యారో ట్రాన్స్‌ప్లాంట్‌ ఫిజీషియన్‌ డాక్టర్‌ గణేష్‌ జైశెత్వర్‌ తెలిపారు. బ్లడ్‌ డిజార్డర్స్‌, బ్లడ్‌ కేన్సర్‌ నివారణకు నూతన ఆవిష్కరణ తీసుకువచ్చేందుకు డెక్కన్‌ హెమటో లింక్‌ 2.0–2025 పేరిట ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఈ మేరకు మంగళవారం హైదర్‌గూడ ఎన్‌ఎస్‌ఎస్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 200 పైగా జాతీయ, 10కి పైగా అంతర్జాతీయ నిపుణులతో నిర్వహించే ఈ కాన్ఫరెన్స్‌ రక్త్‌ టికిల్‌, ఎసెన్షియల్‌ హెమటాలజీ, అడ్వాన్స్‌డ్‌ హెమటో–ఆంకాలజీ, స్టెమ్‌ సెల్‌ ట్రాన్స్‌ప్లాంటేషన్‌పై అత్యాధునిక చర్చలను తీసుకువస్తుందన్నారు.

13న స్వామి వివేకానంద హైదరాబాద్‌ పర్యటనకు గుర్తుగా కార్యక్రమం

సుల్తాన్‌బజార్‌: స్వామి వివేకానంద తొలి హైదరాబాద్‌ సందర్శనను గుర్తు చేసుకునేందుకు శ్రీరామకృష్ణ మాథిస్‌తో కలిసి ఈనెల 13న మహబూబ్‌ కళాశాలలోని స్వామి వివేకానంద ఆడిటోరియంలో యూత్‌ కన్వెన్షన్‌ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మహబూబ్‌ కళాశాల నిర్వహణ కమిటీ గౌరవ అధ్యక్షుడు పీఎల్‌ శ్రీనివాస్‌ పేర్కొన్నారు. సమాజానికి, యువతకు ప్రత్యేక సందేశాన్ని అందించడానికి ఈ కార్యక్రమం రూపొందించినట్లు తెలిపారు. ఈ మేరకు మంగళవారం హైదర్‌గూడ ఎన్‌ఎస్‌ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కళాశాల ఉపాధ్యక్షుడు నరేష్‌ యాదవ్‌తో కలిసి మాట్లాడారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర గవర్నర్‌ జిష్ణుదేవ్‌ వర్మ పాల్గొంటారని తెలిపారు. స్వామి ప్రభోదానందతో పాటు శ్రీ రామకృష్ణ మఠంలోని ఇతర సీనియర్‌ సన్యాసులు పాల్గొంటారని తెలిపారు.

పీఎం ఇంటర్న్‌షిప్‌ పథకంపై ఐటీఐ విద్యార్థులకు అవగాహన



అవగాహన కార్యక్రమంలో అధికారులు, విద్యార్థులు

విజయనగర్‌కాలనీ: ఐటీఐ విద్యార్థులకు మెరుగైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలను పెంపొందించేందుకు భారత ప్రభుత్వ కార్పొరేట్‌ వ్యవహారాల మంత్రిత్వ శాఖ కృషి చేస్తున్నదని అధికారులు పేర్కొన్నారు. మంగళవారం మల్లేపల్లి ఐటీఐ ప్రాంగణంలో తెలంగాణ ఓవర్‌సీస్‌ మ్యాన్‌ పవర్‌ కంపెనీ కార్యాలయంలో పీఎం ఇంటర్న్‌షిప్‌ పథకంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు మాట్లాడుతూ..తెలంగాణ డిజిటల్‌ ఎంప్లాయిమెంట్‌ ఎక్చేంజ్‌, కార్మిక ఉపాధి శిక్షణ శాఖ సంయుక్తంగా ఐటీఐ విద్యార్థులకు మెరుగైన ఇంటర్న్‌షిప్‌ అవకాశాలు కల్పించేందుకు చేస్తున్న కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. యువతలో వృత్తి నైపుణ్యం పెంపొందించడంతో పాటు శిక్షణ కాలంలో వారికి స్టయిఫండ్‌ అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల శాఖ డైరెక్టర్‌ మన్సూర్‌ ప్రాంతీయ డైరెక్టర్‌ రిచాతో పాటు ప్రభుత్వ ఐటీఐల విద్యార్థులు పాల్గొన్నారు.

గోషామహల్‌లో ఉస్మానియా ఆసుపత్రి నిర్మించకుండా చూడాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

అబిడ్స్‌: గోషామహల్‌ పోలీస్‌ గ్రౌండ్స్‌లో ఉస్మానియా ఆసుపత్రి నిర్మించకుండా సీపీఎం పూర్తి మద్దతు ఇవ్వాలని గోషామహల్‌ ఆల్‌ పార్టీల నాయకులు కేడీ ధినేష్‌, కోటి శైలేష్‌ కురుమ, విశాల్‌, సరస్వతి పలువురు నాయకులు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌ వెస్లీకి విజ్ఞప్తి చేశారు. ఉస్మానియా ఆసుపత్రిని నిర్మిస్తే లక్షలాది మంది అవస్థలపాలవుతారని వారన్నారు. ఈ కార్యక్రమంలో గోషామహల్‌కు చెందిన పలువురు నాయకులు పాల్గొన్నారు.

జిమ్నాస్టిక్స్‌లో సత్తాచాటిన ఏసీగార్డ్స్‌ విద్యార్థులు



నాంపల్లి: 7వ రాష్ట్ర స్థాయి ఏరోటిక్‌ ఫిట్‌నెస్‌ చాంపియన్‌షిప్‌ పోటీల్లో ఏసీగార్డ్స్‌కు చెందిన విద్యార్థులు సత్తా చాటారు. తమిళనాడులో జరిగిన పోటీల్లో నగరానికి చెందిన ఎక్స్‌గ్రేవిటీ జిమ్నాస్టిక్స్‌ టీమ్‌ విజయం సాధించింది. ఈ పోటీల్లో గోల్డ్‌ మెడల్‌తో పాటుగా చాంపియన్‌ ట్రోఫీని కైవసం చేసుకుంది. కోచ్‌లు రాజాసింగ్‌, బి.బాలరాజ్‌, సురేష్‌ నాయర్‌ దగ్గర ఆర్‌.గ్రిషిక, ఓంసింగ్‌, ప్రేమ్‌ శర్మ, అక్షయ్‌ సింగ్‌, జె.ధరమ్‌ ప్రసాద్‌, బి.జ్ఞానవి, శ్రీనివాస్‌ ఎస్‌.పి, ఎండీ హుస్నేనా, రుక్కయా, కనిష్క, ఎం.సునిధి చంద్ర శిక్షణ పొందారు. గోల్డ్‌మెడల్‌ సాధించిన టీమ్‌ను కోచ్‌లు అభినందించారు.

నిరంతరాయంగా విద్యుత్‌ను అందించాలి

నాంపల్లి: వేసవి కాలం, రంజాన్‌ మాసం సమీపిస్తున్న నేపథ్యంలో ఎమ్మెల్యే మాజీద్‌ హుస్సేన్‌ మంగళవారం విద్యుత్‌ శాఖ అధికారులతో సమావేశం అయ్యారు. విద్యుత్‌కు అంతరాయం కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ నిరంతరాయంగా విద్యుత్‌ను అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాసబ్‌ట్యాంక్‌ డీఈ సుధీర్‌, ఏడీఈ కె.విజయ్‌కుమార్‌, నాయక్‌, ఏఈ చిలుక నారాయణ తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్‌ శాఖ అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే

కళా సంస్థల కృషి అభినందనీయం



ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

గన్‌ఫౌండ్రీ: ప్రముఖ నృత్య శిక్షణాలయం ఎస్‌ఎల్‌బీ కూచిపూడి కళానిలయం 19వ వార్షికోత్సవ వేడుకలను మంగళవారం రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నృత్య గురువు డాక్టర్‌ వినీలరావు శిష్యబృందం వివిధ అంశాలపై చేసిన నృత్య ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. మహిషాసుర మర్దిని స్తోత్రం, రాజేశ్వర్‌ అష్టకం, జావలి వంటి అంశాలపై 250 మంది కళాకారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్య రూపకాలు విశేషంగా అలరించాయి. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్‌ మామిడి హరికృష్ణ మాట్లాడుతూ..శాస్త్రీయ సంగీత నృత్యాలను భావితరాలకు అందజేస్తున్న కళా సంస్థల కృషి అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ నృత్య గురువు భాగవతుల సేతూరాం, కళాపత్రిక సంపాదకులు మహ్మద్‌ రఫీ తదితరులు పాల్గొన్నారు.

PUBLIC NOTICE

General Public is hereby informed that my client MOHAMMED RIZWAN S/o MOHAMMED OSMAN, aged: 37 years, Occ: Business, Resident of H.No.9-11-2351, Golconda Fort, Hyderabad, T.G., lost his elder brother Mr. MOHAMMED SULTAN S/o. MOHAMMED OSMAN, original property document i.e. Sale Deed vide Document No.4091 of 2008, dated: 16th June, 2008, registered at SRO Shamshabad, R.R. District, in respect of Plot No.83, admeasuring 167.00 Square Yards, in Survey No. 462 & 463/P, situated at "North East Flycity", Shamshabad Village, Shamshabad Mandal, Ranga Reddy District, T.G., on 30-01-2025, while he was travelling from his residence to Xerox Center Shop at Golconda, and when he reached the Xerox Center Shop at Golconda, he found that he lost his hand bag containing the Original Sale Deed Document No.4091. If any person or persons have found the above said document kindly contact me as soon as possible.

Sd/- Noor Mohammed, Advocate
Office at: 9-10-99, Risala Bazar, Golconda Fort, Hyderabad, T.S.
Cell: 9849447318, 9885868172